క్లుప్తంగా

మార్కెట్ బడ్జెట్‌కు ఏకగ్రీవంగా ఆమోదం

నేలకొండపల్లి: నేలకొండపల్లి మార్కెట్ 2023–24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను పాలక వర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈమేరకు మార్కెట్ కార్యాలయంలో సోమవారం జరిగిన పాలకవర్గ సమావేశంలో రూ.2 కోట్లతో రూపొందించిన బడ్జెట్‌ను ఆమోదించడమే కాక రైతులకు 50 శాతం రాయితీపై టార్పాలిన్లు ఇవ్వాలని తీర్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ శాంత మాట్లాడుతూ.. మార్కెట్‌కు ఈ సంవత్సరం ప్రభుత్వం రూ.5.19 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటికే రూ.5.22 కోట్లు సమకూరిందని తెలిపారు. ఇందులో పైనంపల్లి చెక్‌పోస్టు నుంచి రూ.80 లక్షలు ఆదాయం రావడంపై సిబ్బంది, సెక్యూరిటీ గార్డులను అభినందించారు. మార్కెట్ కార్యదర్శి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, డైరెక్టర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పీఈటీ నియామకానికి 18న ఇంటర్వ్యూలు

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల(ఖమ్మం బాలికలు–1)లో తాత్కాలిక పద్ధతిన మహిళా పీఈటీని నియమించనున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. బీపీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు ఈనెల 18న ఇంటర్వ్యూలకు అన్ని సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. రఘునాథపాలెంలోని కోయచెలక క్రాస్‌లో ఉన్న శారద ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయని, వివరాలకు 73311 70860 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

పరీక్షప్యాడ్లు పంపిణీ

కూసుమంచి: జక్కేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి తన తండ్రి నర్సింహారెడ్డి జ్ఞాపకార్థం పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. సర్పంచ్‌లు నలబోలు మాధవి, రాయబారపు స్వాతి, ఎంపీటీసీ వెంకటనారాయణ, మార్కెట్ వైస్ చైర్మన్ రాంరెడ్డి, ఉప సర్పంచ్ తంగెళ్ల ఉమా, హెచ్‌ఎం చిరంజీవి నాయుడు, పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

నేలకొండపల్లి: జన చైతన్య యాత్రలో భాగంగా ఈ నెల 25న నేలకొండపల్లిలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి, రచ్చా నరసింహారావు, ఏటుకూరి రామారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, రాసాల కనకయ్య, దుగ్గి వెంకటేశ్వర్లు, సిరికొండ ఉమామహేశ్వరీ, భూక్యా కృష్ణ, కట్టేకోల వెంకన్న, మారుతి కొండలరావు, మండడపు మురళీకృష్ణ, ఎడ్ల తిరపతిరావు, పెద్దిరాజు నర్సయ్య, బండి రాంమూర్తి, బలుసు ప్రమీల, చింతలపాటి భాస్కర్, శివరాజు, శీలం అప్పారావు పాల్గొన్నారు.

23న ఎంవీపాలెంలో జనచైతన్య యాత్ర

ఖమ్మంరూరల్: ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామాజిక న్యాయ పరిరక్షణే ధ్యేయంగా సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని పెదతండా పరిధిలోని ఇందిరమ్మకాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ నెల 23న ఎం వెంకటాయపాలెంలో జరిగే బహిరంగ సభకు తరలి వచ్చి జయప్రదం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్. కృష్ణ, ఏటుకూరి ప్రసాద్‌రావు, పద్మ, ఎన్ లక్ష్మయ్య, వాసం నాగేశ్వరరావు, గోవిందరావు, సుధాకర్, పి. శ్రీనివాస్, హనుమంతరావు, గోకినపల్లి ఉపేందర్, బాబు, రామచంద్రు పాల్గొన్నారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

ఖమ్మంమయూరిసెంటర్: నియోజకవర్గంలో ఎనిమిది వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు గాను ఇప్పటి వరకు కేవలం 2,100 ఇళ్లు మాత్రమే లబ్ధిదారులకు ఇచ్చారని, వెంటనే నిర్మించి అర్హులైన వారందరికీ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్ డిమాండ్ చేశారు. సోమవారం రమణగుట్ట ప్రాంతంలో సీపీఎం టూటౌన్ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు నర్రా రమేష్, కుమారి, పి.వాసు, బీబీ, సత్యం, రాధ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సార్
వినోద	బలగం
సాయిరాం	తూ జూటీ మై మక్కర్, ఈఎస్ఐ సనాతన్
ఆదిత్య	ఆర్‌ఆర్‌ఆర్
శ్రీనివాస	65
సుందర్	సింహో

– ఖమ్మం గాంధీచౌక్

రాత్రి అరుసుడు.. పగలు కరుసుడు!

ఐదో డివిజన్‌లో హడలెత్తిస్తున్న వీధికుక్కలు
- ఒంటరిగా బయటకు వెళ్లాలంటే భయం భయం
- కుక్కల నివారణ చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు


ఐదో డివిజన్‌లో రాత్రివేళ రహదారిపై ఉన్న కుక్కలు

ఖమ్మంఅర్బన్: పలుచోట్ల పిల్లలు, పెద్దలను కుక్కలు కరిచాయని.. కుక్కల దాడిలో చిన్నారులు మృతి చెందారని పత్రికల్లో వార్తలు వస్తున్నా.. నగరంలోని పలు డివిజన్లలో వీధికుక్కల నియంత్రణపై అధికారులు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. నగరం నడిబొడ్డున ఉన్న 5వ డివిజన్‌లోని పలు వీధుల్లో కుక్కలు స్వైర్వవిహారం చేస్తున్నారు. గుంపులుగా వీధుల్లో తిరుగుతూ అరుపులతో పరస్పరం దాడులకు దిగుతుండడంతో కాలనీ వాసులకు నిద్ర ఉండడం లేదు. అతేకాకుండా రహదారిపై వచ్చివెళ్లే వారిని కరుస్తుండడంతో డివిజన్ వాసులను ఆందోళనకు గురిచేస్తోంది.

చికెన్, మటన్ షాపులే అడ్డా..

ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రోడ్డును ఆనుకుని ఉన్న ఐదో డివిజన్‌లో చికెన్, మటన్ షాపులే అడ్డాగా కుక్కలు ఉంటూ స్థానికులను భయపెడుతున్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వివిధ అవసరాల నిమిత్తం వచ్చే మహిళలు ఈ కుక్కలను చూసి ఒకటికి, రెండు సార్లు ఆలోచించాల్సి వస్తోంది. ఒకరు రక్షణగా లేకపోతే వీధుల్లో కుక్కలను దాటి వెళ్లడం అసాధ్యమని చెబుతున్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే ఫోన్ చేయాలని కేఎంసీ ఉద్యోగులు సూచిస్తుండగా స్థానికులెవరైనా కుక్కల బెడదపై ఫోన్ చేస్తే 'మీ ప్రాంతంలో ఉండే జవాన్‌కు చెప్పండి.. ఆయనే చర్యలు తీసుకుంటాడు' అనే సమాధానం వస్తోందని వాపోతున్నారు. ఒకవేళ జవాన్‌కు చెప్పినా సమస్యకు పరిష్కారం లభించడం లేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు నగరం నడిబొడ్డున ఉన్న 5వ డివిజన్‌లో కుక్కల నియంత్రణపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో కుక్కలు ఇద్దరు, ముగ్గురు చిన్నారులపై దాడి చేయగా డివిజన్‌లోని కాల్వకట్ట బజార్, ఎన్నెస్పీ విశ్రాంతి భవనం ఎదురు వీధి, పోస్టాఫీస్ వీధి, రామాలయ వీధి తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని చెబుతున్నారు.

చెప్పినా పట్టించుకోవడంలేదు..



డివిజన్‌లో కుక్కల బెడదపై అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా విని వదిలేస్తున్నారు. ప్రతిపక్ష కార్పొరేటర్ల డివిజన్ అయినందునే ఇలా చేస్తున్నారని అనిపిస్తోంది. ఇతర డివిజన్లలో కుక్కల నియంత్రణ చేసినట్లుగా ఇక్కడ జరగడం లేదు. నిధులు మంజూరులోనూ పక్షపాతం చూపిస్తున్నారు.

– పల్లెబోయిన భారతీచంద్రం, కార్పొరేటర్, 5వ డివిజన్

ఒంటరిగా వెళ్లాలంటే భయం



మా వీధిలో ఇటీవల వీధి కుక్కలు ఎక్కువయ్యాయి. దీంతో రాత్రి మాటేమో కానీ పగలు కూడా ఒంటరిగా బయటకు వెళ్లాలంటేనే భయం వేస్తుంది. ఎటు వైపు నుండి కుక్కలు వచ్చి దాడి చేస్తాయోనని ఆందోళనగా వచ్చివెళ్తున్నాం. రాత్రీపగలు స్వైరవిహారం చేస్తున్న కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– వాకా ఉమామహేశ్వరి, డివిజన్ వాసి

కుక్కల అరుపులతో నిద్ర ఉండదు..



రాత్రి అయితే కుక్కలు బ్యాచ్‌లుగా చేరి కొట్టుకుంటున్నాయి. వీటి అరుపులతో నిద్ర కూడా పట్టడం లేదు. ఇక రాత్రి వేళ రహదారిపై వచ్చివెళ్లాలంటే కుక్కల కారణంగా వణుకు పుడుతోంది. కుక్కల దాడులు తీవ్రమైనా అధికారులు పట్టించుకోవడం లేదు. అనేకమార్లు వారికి ఫిర్యాదు చేసినా చర్యలు లేవు.

– చెరుకూరి లక్ష్మి, డివిజన్ వాసి

అధికారులకు చెప్పినా ఫలితం లేదు



డివిజన్‌లో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఇతర ప్రాంతాల్లో కుక్కలు దాడి చేశాయనే వార్తలు వింటుంటే మాకు భయమేస్తోంది. పిల్లలను ఒంటరిగా స్కూల్ పంపాలంటేనే ఆందోళనగా ఉంది. ఈ సమస్యపై పదిహేను రోజుల క్రితం అధికారులకు వివరించాం. అయినా ఫలితం లేదు.

– కోలేటి రాధాకృష్ణ, డివిజన్ వాసి

కరాటేలో విద్యార్థినుల ప్రతిభ


తిరుమలాయపాలెం: విద్యార్థినిలతో ఎస్.ఓ రమాకుమారి


ఖమ్మంఅర్బన్: సర్టిఫికెట్లు అందజేస్తున్న హెచ్‌ఎం

తిరుమలాయపాలెం: ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ 2023 పోటీల్లో తిరుమలాయపాలెం కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు 16 మెడల్స్ సాధించి తమ ప్రతిభను చాటారు. పోటీల్లో 7 గోల్డ్‌మెడల్స్, 3 సిల్వర్, 6 బ్రౌంజ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా సోమవారం మెడల్స్ సాధించిన విద్యార్థినిలను పాఠశాల స్పెషల్ ఆఫీసర్ రమాకుమారి, కరాటే మాస్టర్ నరసింహారావు ఉపాధ్యాయులు అభినందించారు.

కరాటే శిక్షణలో విద్యార్థినుల ప్రతిభ

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్ ఇందిరానగర్ హైస్కూల్ విద్యార్థినులు నెల పాటు కరాటే శిక్షణ విజయవంతంగా పూర్తిచేశారని హెచ్‌ఎం శైలజలక్ష్మి తెలిపారు. ఖమ్మం వర్తక సంఘం భవనంలో కరాటే మాస్టర్ హరి ఆధ్వర్యాన శిక్షణ పూర్తిచేసుకున్న 50 మంది బాలికలను సోమవారం పాఠశాలలో అభినందించి సర్టిఫికెట్లు అందించారు. హెచ్‌ఎంతోపాటు పీఈటీ బాబురావు, ఉపాధ్యాయులు హరిప్రసాద్, కుమారి, నాగయ్య, మాధవి, లత, స్నేహలత, పద్మ, క్రిస్టోఫర్ పాల్గొన్నారు.

వసంతరావును సన్మానించిన ఎస్సీ డీడీ


వసంతరావును సన్మానిస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఎన్నిక అయిన దోతుల వసంతరావును ఎస్సీడీడీ కస్తాల సత్యనారాయణ సన్మానించారు. సోమవారం ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయంలో ఉద్యోగులతో కలిసి వసంతరావును శాలువాతో సత్కరించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌దుకాణం ఏర్పాటు చేయాలి

కూసుమంచి: నూతనంగా ఏర్పడిన లాల్‌సింగ్‌తండా గ్రామపంచాయతీలో ప్రభుత్వ చౌకధరల దుకాణం ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం సర్పంచ్ ధరావత్ వెంకట్ ఆధ్వర్యంలో అదనపు కలక్టర్ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. పంచాయతీలో దుకాణం లేకపోవటంతో పక్క పంచాయతీకి వెళ్లి నిత్యవసరాలు తీసుకురావాల్సి వస్తుందని, తమకు కూడా దుకాణం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి భూక్యా నర్సింహా, గ్రామ కార్యదర్శి భూక్యా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలనూ ఒకే పూట నిర్వహించాలి

ఖమ్మంగాంధీచౌక్: ఎండలు పెరుగుతున్నందున అంగన్‌వాడీ కేంద్రాలను సైతం ఒకటే పూట నిర్వహించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ బాధ్యులు సోమవారం జిల్లా సంక్షేమాధికారి సీహెచ్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తలకు పని భారం తగ్గించాలని, ఆరోగ్యం సహకరించని వారిని బీఎల్‌ఓ విధుల నుంచి మినహాయించాలని, స్మార్ట్ ఫోన్లలో సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు మాటూరు లక్ష్మీనారాయణ, కృష్ణకుమారి, పారిజాతం, లక్ష్మి, విజయలక్ష్మి, ఆసన్న, రెహానా, అలివేలు, స్వరూపారాణి, ధనలక్ష్మి, ముంతాజ్, వాణిశ్రీ, జ్యోతి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'లో విశిష్ట సేవలు

నేలకొండపల్లి: స్థానిక మేజర్ పంచాయతీ లో కంటి వెలుగు కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ విశిష్ట సేవలు అందించారని ఎంపీడీఓ కె.జమలారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీలో కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ముగింపు సందర్భంగా సోమవారం సన్మాన కార్యక్రమంను నిర్వహించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్.కె.రాజేష్, డాక్టర్. శ్రావణ్‌కుమార్, డాక్టర్ మణిబాబు, డాక్టర్ ప్రవీణ, ఎస్సై ప్రవంతి, పంచాయతీ కార్యదర్శి దేవేందర్, పీహెచ్‌ఎస్ దుర్గ, చంద్రశేఖర్, వీరన్న, జ్యోతి, నాగమణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


కూసుమంచి: శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కూసుమంచి: మండలంలోని రాజుపేట బజార్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ మండవ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మోదుగు వీరభద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుణ్‌కుమార్, ఏఎన్‌ఎంలు నీలావతి, సుజాత, పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్ట్ స్థలాలను స్వాధీనం చేసుకోవాలి

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీలో వివిధ సమస్యలపై విచారించి చర్యలు తీసుకోవాలని గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మేజర్ పంచాయతీలో గ్రీన్ బెల్ట్ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని గ్రామానికి చెందిన ఇఫ్టూ పాలేరు డివిజన్ నాయకులు పగిడికత్తుల రామదాసు ఫిర్యాదు చేశారు. ఆరో వార్డులో రహదారి ఆక్రమణపై కనకంపూడి రవి ఫిర్యాదు చేశారు.

ఆలయానికి శంకుస్థాపన

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువు గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ కంఠమేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం జెడ్పీటీసీ ఇంటూరి బేబీ, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్ దంపతులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండా సత్యం, ఎంపీటీసీ అంబాల ఉమా, పూజారి బొమ్మగాని వెంకటేశ్వర్లు, అంబాల లింగయ్య గౌడ్, అంబాల వీరబాబు, ఐతగాని నాగేశ్వరరావు, రాంకోటి, చిన నర్సింహారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే రుణమాఫీ

తిరుమలాయపాలెం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని మేకలతండా, కుక్కలతండాలలో హాథ్ సే హాథ్‌జోడో యాత్రలో భాగంగా ఇంటింటికీ తిరిగి గతంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టే సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కి తగిన గుణపాఠం చెప్పి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఉన్నం రాజశేఖర్, సాగర్‌రెడ్డి, భద్రు, మోతీలాల్, నాగేశ్వరరావు, పిచ్చయ్య, చిరంజీవి, మోహన్, బత్తుల రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలి

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రతీనెలా మొదటి తేదీనే వేతనాలు చెల్లించటంతో పాటు ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావులు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ధర్నాచౌక్‌లో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, పెన్షనర్లు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ మహబూబ్ అలీ, గోపిచంద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: ఉద్యోగులకు ప్రతీ నెలా 1న వేతనాలు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా నాయకులు టి.గురవయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎస్‌టీఓ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, విజయ్, రాంబాబు, వి.భాస్కర్, నవాబుసాహెబ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

నేలకొండపల్లి: ప్రభుత్వ స్థలాలు, డొంకను కాజేసేందుకు కొందరు యత్నిస్తున్న విషయమై 'సాక్షి'లో 'పేట్రేగుతున్న రియల్టర్లు..!' శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనంతో అధికారులు స్పందించారు. ఈమేరకు కథనం క్లిప్పింగ్‌ను తహసీల్దార్ దారా ప్రసాద్‌కు కలెక్టర్ పంపించి విలువైన ప్రభుత్వ స్థలం, డొంక ఆక్రమణకు గురికాకుండా హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో తహసీల్దార్‌తో సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. స్థలం ఆక్రమణకు గురికాకుండా చూస్తామని, ఎవరైనా ప్రభుత్వ భూమి జోలికొస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, స్థలానికి హద్దుల ఏర్పాటుకు సర్వే చేయాలని సిబ్బందికి సూచించారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

ఒత్తిడి వీడితే విజయం సులభం


డైరెక్టర్ నాగేంద్రకుమార్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు ఒత్తిడి వీడితే సులభంగా విజయం సాధిస్తారని ప్రముఖ మానసిక వైద్యులు ఆర్.సతీష్‌బాబు అన్నారు. సోమవారం నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఆర్‌వి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యనందించటం ద్వారా భవిష్యత్‌లో వారు ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నీలిమ, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

అర్బన్ సీఐగా శ్రీహరి బాధ్యతలు



ఖమ్మంఅర్బన్: ఖమ్మం అర్బన్ (ఖానాపురంహవేలి) సీఐగా టి.శ్రీహరి సోమవారం బాధ్యతలు చేపట్టారు. నిజామాబాద్ నుండి శ్రీహరి బదిలీపై ఖమ్మంఅర్బన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాలు అరికట్టడంతో ప్రజల సహకారం అందించాలని కోరారు. సీఐ రామకృష్ణను స్టేషన్‌లో పనిచేసే ఎస్సైలు, పలువురు సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రూరల్ సీఐగా రాజిరెడ్డి..



ఖమ్మంరూరల్: రూరల్ సీఐగా రాజిరెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. భూపాలపల్లిలో పనిచేస్తున్న రాజిరెడ్డి బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ రూరల్ సర్కిల్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు.

ప్రీతి ఆత్మహత్యపై విచారణ చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: డాక్టర్ ప్రీతి ఆత్మహత్యపై సింగిల్ జడ్జీతో విచారణ జరిపించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి భద్రూనాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జెడ్పీ సెంటర్‌లో నిరసన తెలిపి, అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మొగిలి స్నేహలతకు వినతిపత్రం అందజేశారు. రవిచంద్ర చౌహాన్, కృష్ణనాయ్, ఉపేంద్ర, వీరన్ననాయక్, శ్రీను, వెంటరమణ, కిషన్ నాయక్, రమ్య, స్రవంతి బాయి, మహేశ్వరిబాయి, రెహమాన్, షేక్, నజీమా, రవి, లక్ష్మి, మంగ, దేవి, సతీష్‌నాయక్ పాల్గొన్నారు.

మహిళను దూషించిన ముగ్గురిపై కేసు

ఖమ్మంరూరల్: మహిళను దూషించిన కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవూఫ్ తెలిపారు. ఖమ్మంకు చెందిన యాలమూడి శేష ప్రసూన 2000లో మండలంలోని ఏదులాపురం వద్ద ఎకరం భూమి కొనుగోలు చేసింది. ఈనెల 8న స్థలం వద్దకు ఆమె రాగా, పక్క స్థలం యజమానులు పి.రమేష్‌రెడ్డి, ఎస్.గోపాల్‌రావు, ఎం.వెంకటేశ్వరరావు దూషించారు. దీంతో ఆమె సోమవారం చేసిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేశారు.

మార్కెట్‌లో వాటర్ కూలర్లు


కూలర్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ శ్వేత

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో వేసవి దృష్ట్యా రైతులు, కార్మికులు, వ్యాపార, ఉద్యోగ వర్గా దాహార్తిని తీర్చేందుకు వాటర్ కూలర్లను ఏర్పాటు చేశారు. మిర్చి యార్డు వర్గాలకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేసిన వాటర్ కూలర్‌ను సోమవారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం, వైస్ చైర్మన్ షేక్ అఫ్జల్, పాలక వర్గ సభ్యులు గుండ్ల ముత్తయ్య, జాటోత్ సుందర్ సూర్య, మందా రామకృష్ణ, యాసా రామారావు, సున్నా శ్రీనివాసరావు, తాతా వెంకటేశ్వర్లు, వంకాయలపాటి వెంకట లచ్చయ్య, గ్రేడ్–2 కార్యదర్శి బజార్, సహాయ కార్యదర్శి నిర్మల పాల్గొన్నారు.


జీపీ కార్మికుల నిరసన

కామేపల్లి (కారేపల్లి): కామారెడ్డి జిల్లాలో పంచాయతీ కార్మికుడు కొంగరి బాబు ఆత్మహత్యకు నిరసనగా కామేపల్లి మండల కార్యాలయం ఎదుట తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మికులు యూనియన్ సీఐటీయూ, టీఆర్‌ఎస్‌కేవీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. సీఐటీయూ మండలాధ్యక్షుడు ఉప్పుతల వెంకన్న, టీఆర్‌ఎస్‌కేవీ అధ్యక్షుడు ఎం.మల్లిఖార్జునరావు, రాయల కృష్ణ, నాగపురి వంశీ, ఇజాక్, నారాటి నాగేశ్వరరావు, జర్పల రాందాస్, తిలక్, బి.భరత్ పాల్గొన్నారు.

ఖమ్మం మామిళ్లగూడెం: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య డిమాండ్ చేశారు. కార్మికులకు జీతాలు రాకపోవడంతో నిరసనగా ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఖమ్మం ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, కొయ్యల శ్రీనివాస్, రమేష్, సాగర్‌రెడ్డి, సాందు, మన్సూరు, వెంకటరెడ్డి, సత్యనారాయణ, శ్రీను, శంకర్, రాము, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించండి

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తోందని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు శ్రద్ధ వహించాలని కార్పొరేటర్ శీలంశెట్టి రమా వీరభద్రం అన్నారు. సోమవారం నగరంలోని 51వ డివిజన్ అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, సుస్మిత, రమాదేవి, మహిళలు, ఆయాలు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

డ్రెయినేజీని మరిచిపోయారా?

ఖమ్మం నగరంలో పారిశుద్ధ్యంపై పాలకులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించినా క్షేత్ర స్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డ్రెయినేజీలను శుభ్రం చేయడంలో సిబ్బంది అలసత్వం కారణంగా దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వైరా రోడ్డులోని పాత ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారి పక్కన డ్రెయిన్‌లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పేరుకుపోయినా సిబ్బంది కన్నెత్తి చూడడం లేదు.

– ఖమ్మం మయూరిసెంటర్



ప్రశ్నించాల్సిన అధికారి : పి.వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కేఎంసీ
సెల్ నంబర్ : 9177236224